# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 5 । జనవరి । 2023






**చీనీ టన్ను రూ.28 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28 వేలు ధర పలికాయి.



**టమాట కిలో రూ.8**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.3.50 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

**గరిష్టం/కనిష్టం**
**31.9°/11.5°**

జిల్లాలో బుధవారం చలి తీవ్రత పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### ఎంబీసీ టెండర్ ఆమోదానికి అడుగులు

**మడకశిర:** మడకశిర బైపాస్ కెనాల్ (ఎంబీసీ) టెండర్ ఆమోదం కోసం స్టేట్ లెవెల్ టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ)కి పంపినట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్ బుధవారం 'సాక్షి'కి తెలిపారు. మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.214.85 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. ఇందులో రూ.173 కోట్లతో కాలువ పనులను చేపట్టడానికి వీలుగా టెండర్లు పిలవగా, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ టెండర్‌ను దక్కించుకుందన్నారు. ప్రస్తుతం ఈ టెండర్‌కు ఎస్ఎల్‌టీసీ ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. ఆమోదం వచ్చిన వెంటనే బైపాస్ కెనాల్ పనులు ప్రారంభించి గడువులోపు పూర్తి చేస్తామన్నారు.

### ఉపాధ్యాయురాలికి ఎక్స్‌లెన్స్ అవార్డు



గవర్నర్ తమిళసై నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు రోస్‌మెర్సీరాణి

**లేపాక్షి:** మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి.రోస్‌మెర్సీరాణి మహాత్మాజ్యోతిభా పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే ఎక్సలెన్సు అవార్డు – 2023కు ఎంపికైంది. ఇటీవల తిరుపతిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. పాఠశాలలో ఇన్నోవేటివ్ టీచింగ్, జాయ్‌ఫుల్ టీచింగ్, టీఎల్ఎం తదితర అంశాలపై అవార్డుకు ఎంపికైనట్లు హెచ్ఎం కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు.

### నిబంధనల మేరకే పరిహారం



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

**ముదిగుబ్బ:** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు జాతీయ రహదారుల సంస్థ నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లిస్తారని డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటి తహసీల్దార్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి ఏర్పాటుతో మండలంలోని సంకేపల్లి, జొన్నల కొత్తపల్లి, గుంజేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులు భూములు కోల్పోతున్నారన్నారు. రిజిస్ట్రేషన్ జరిగే రోజు ఉన్న రేటు ఆధారంగా పరిహారం లెక్కించి ఇస్తారన్నారు. భూమితో పాటు బోర్లు, బావులు తదితర ఏవైనా నిర్మాణంలో ఉన్నా... అన్నింటికీ నివేదిక ఆధారంగా ధర నిర్ణయిస్తామన్నారు. అయితే రెవెన్యూ అధికారులు నిర్ణయించిన ధరకు భూములిచ్చేందుకు రైతులు అంగీకరించలేదు. దీంతో పరిహారం పెంపుకోసం కలెక్టర్‌కు విన్నవించుకోవచ్చని డీటీ సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, వీఆర్ఓలు, రైతులు పాల్గొన్నారు.

### పీజీ మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

**అనంతపురం సిటీ:** అనంతపురంలోని జేఎన్‌టీయూ అనుబంధ ఓటీపీఆర్ఐ కళాశాలలో ఎమ్మెస్సీ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సులో మిగిలిన స్పాన్సర్డ్ కోటా సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆ విభాగం డైరెక్టర్ ఆచార్య ఈశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు. అర్హత ఉండి, ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు, ప్రాసెసింగ్, ట్యూషన్ ఫీజుతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

### నేటి నుంచి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆర్టీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాలఫెర్రర్, ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ శ్రీనివాసన్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఏడో తేదీ వరకు వివిధ అంశాల్లో క్రీడా పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# కొలతల్లో కోత.. కల్తీ వాత!

- ధర్మవరానికి చెందిన జగన్‌మోహన్ ఓ ప్రభుత్వ శాఖలో డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఇటీవల బెంగళూరు రోడ్డులోని ఓ పెట్రోల బంకులో వాహనానికి రూ.500 పెట్రోల్ వేయించాడు. వాహనం మధ్యలోనే ఆగిపోవడంతో అనుమానం వచ్చి చూడగా ఖాళీ ట్యాంకు కనిపించింది. కనీసం రూ.200 విలువ గల పెట్రోల్ కూడా బంకులో కొట్టలేదని వాపోయాడు.
- హిందూపురానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల తన కారులో బెంగళూరుకు వెళ్తూ హిందూపురం బస్టాండు సమీపంలోని పెట్రోల్ బంకులో డీజిల్ పోయించాడు. 10 కిలోమీటర్లు వెళ్లగానే వాహనం ఆగిపోయింది. ఏంటా అని పరిశీలిస్తే ఇంజిన్ సమస్య తలెత్తినట్లు గమనించాడు. మెకానిక్‌కు అప్పజెప్పి బస్సులో వెళ్లాడు. కల్తీ ఇంధనం వల్లే సమస్య తలెత్తినట్లు తెలిసింది.
- పెనుకొండకు చెందిన ఓ యువకుడు ఇటీవల కొత్త బైక్ కొన్నాడు. నాణ్యతగా ఉంటుందని అందరూ చెప్పడంతో పెనుకొండ కోటకు వెళ్లే దారిలో ఉన్న పెట్రోల్ బంకులో పెట్రోలు వేయించుకునేవాడు. నాలుగు నెలలు కూడా గడవకముందే బైక్ స్టార్ట్ కావడం లేదు. సైలెన్సర్ నుంచి పొగ ఎక్కువగా రావడంతో షోరూంకు తీసుకెళ్లాడు. కల్తీ పెట్రోల్ పోయడంతో సమస్య తలెత్తినట్లు మెకానిక్‌లు తెలిపారు. దీంతో ఆ యువకుడు పెట్రోలు బంకు వద్దకువెళ్లి నిర్వాహకులతో గొడవకు దిగాడు.

.. ఇలా జిల్లా వ్యాప్తంగా పెట్రోలు బంకు నిర్వాహకుల మాయాజాలంతో ఎందరో ఇబ్బందులు పడుతున్నారు. కానీ సమయం లేదనో మరో కారణం చేతో ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మరి కొందరికి కల్తీ, తక్కువ పరిమాణంలో ఇంధనం పట్టడంపై ఫిర్యాదు చేయవచ్చన్న విషయమూ తెలీదు.



- పెట్రోల్ బంకుల్లో మాయాజాలం
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న నిర్వాహకులు
- మీటర్ జంపింగ్‌తో తప్పుడు కొలతలు
- కల్తీ ఇంధనంతో నిలిచిపోతున్న వాహనాలు
- ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తున్న అధికారులు

**జిల్లాలోని పెట్రోల్ బంకుల సంఖ్య..**

| | |
|---|---|
| ఇండియన్ ఆయిల్ | 65 |
| హెచ్‌పీ | 33 |
| భారత్ పెట్రోలియం | 21 |

**సాక్షి, పుట్టపర్తి:** పెట్రోల్ బంకుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చి వినియోగదారులను నిలువునా ముంచుతున్నారు. కొలతల్లో మాయాజాలం ప్రదర్శిస్తూ కోత పెట్టడమే కాకుండా ఇంధన కల్తీకి పాల్పడుతున్నారు. దీంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో వాహనదారుల జేబులకు చిల్లు పడుతోంది. అధికారుల నామమాత్రపు తనిఖీలు, వినియోగదారుల్లో కొరవడిన చైతన్యం వెరసి పెట్రోల్ బంకుల నిర్వాహకులది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

**కొలతల్లో దగా ఇలా..**

జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 119 పెట్రోల్ బంకులున్నాయి. వీటి ద్వారా రోజుకు లక్షలాది లీటర్ల పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయి. తూనిక, కొలతల శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంలో పలు పెట్రోల్ బంకుల యజమానులు దోపిడీకి తెగబడినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మీటర్ రీడింగ్ జంపింగ్‌తో నిర్దేశిత కొలతలో కోత పెడుతున్నారు. లీటర్ పెట్రోల్ లేదా డీజిల్‌కు 50 నుంచి 100 మిల్లీ లీటర్ల మేర తక్కువగా వస్తున్నట్లు సమాచారం.

**ఎక్కువ మొత్తంలో పోయించుకుంటే..**

వేగంగా ట్యాంక్ నింపుతున్న క్రమంలోనూ సిబ్బంది కొలత కనిపించకుండా మోసం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఎవరైనా ఎక్కువ మొత్తానికి ఇంధనం పోయించుకున్న క్రమంలోనూ ముందు వాహనానికి పోసిన తర్వాత మీటర్‌పై ఉన్న రీడింగ్ నుంచే చమురు పోస్తూ దగా చేస్తున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

**డిజిటల్ మీటర్లలో అక్రమాలు!**

కొలతల్లో తేడాను అరికట్టేందుకు డిజిటల్ మీటర్లు అమర్చినా, బంకుల నిర్వాహకులు వాటినీ టాంపరింగ్ చేస్తున్నట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ మీటర్లలో సాఫ్ట్‌వేర్‌లో మార్పుల కారణంగా రూ.100, రూ.200 చొప్పున కొనుగోలు చేస్తే రూ.3 నుంచి రూ.5 చొప్పున వాహనదారులు నష్టపోతున్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ వాహనంలో వేసే సమయంలోనూ లీటరుకు రెండు నుంచి మూడు పాయింట్ల మేర కోత పెడుతున్నారు. ఇలా నెలకు రూ.లక్షల్లో వినియోగదారులు నష్టపోతున్నారు.

**ఫిర్యాదులు వస్తేనే స్పందన..**

పెట్రోల్ బంకుల నిర్వాహకులు యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నా... తూనికలు, కొలతలు, పౌరసరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తున్నారు తప్ప.. తనిఖీలు చేపట్టడం లేదు. వినియోగదారుల్లో సైతం చైతన్యం కొరవడటంతో ఏదైనా సంఘటన జరిగితే గొడవకు దిగడం తప్ప ఫిర్యాదు చేయడం లేదు. మూడు, నాలుగు నెలలుగా అధికారులు జిల్లాలోని ఏ పెట్రోలు బంకులోనూ తనిఖీలు చేసిన దాఖలాలు లేవు.

**ఆ ఏడు బంకులపైనే ఆరోపణలు ఎక్కువ**

కొలతలో తేడా, చమురు కల్తీ ఆరోపణలు ఎక్కువగా ఏడు బంకులపై వస్తున్నాయి. పుట్టపర్తి విమానాశ్రయం సమీపంలోని పెట్రోల్ బంకు, పెనుకొండలో కోటకు వెళ్లే దారిలోని బంకు, ధర్మవరం మున్సిపల్ కార్యాలయ సమీపంలోని బంకు, ధర్మవరం మార్కెట్ యార్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకు, హిందూపురం బస్టాండు సమీపంలోని పెట్రోల్ బంకు, కొత్తచెరువులో పుట్టపర్తి రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన బంకు, కనగానపల్లి సమీపంలోని పెట్రోల్ బంకుల్లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**



పెట్రోల్ బంకుల్లో కొలత తక్కువగా రావడం, చమురు కల్తీ అయినట్లు మా దృష్టికి వచ్చిన వాటిపై ఇప్పటికే విచారణ చేస్తున్నాం. వినియోగదారులు నిర్భయంగా సమాచారం ఇవ్వవచ్చు. వెంటనే విచారణ ప్రారంభించి చర్యలకు ఆదేశిస్తాం. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– నాగనాథస్వామి, జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి

**తనిఖీలు చేపడతాం**



పెట్రోలు బంకులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. కొలత తక్కువగా రావడం, చమురు కల్తీ అయినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తూనికలు, కొలతల సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తున్నాం. అంతేకాకుండా వినియోగదారుల్లో చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు చేపడుతున్నాం.

– వంశీకృష్ణారెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి

### భూసేకరణ వేగవంతం చేయండి

- జాయింట్ కలెక్టర్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

**పుట్టపర్తి టౌన్:** జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తిక్‌తో కలిసి జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు, జాతీయ రహదారులకు సంబంధించిన భూ సేకరణపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, 342, 344 జాతీయ రహదారులకు, ఏపీఐఐసీ, వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, భూసేకరణ ప్రక్రియ ఆలస్యం అవుతుందని, దాని ఫలితం ఆ ప్రాజెక్టుపై చూపుతుందన్నారు. వివిధ కారణాలతో కొన్నిచోట్ల భూసేకరణ పెండింగ్‌లో ఉందని, తహసీల్దార్లు దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, నేషనల్ హైవే, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

### హెవీ డ్రైవింగ్‌లో శిక్షణ

**హిందూపురం:** పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో లైట్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారికి శిక్షణ ఇచ్చి హెవీ లైసెన్స్ మంజూరు చేయిస్తామని హిందూపురం ఆర్టీసీ డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు. లైట్ లైసెన్స్ కలిగిన వారికి ప్రభుత్వం నిర్వహిస్తున్న డ్రైవింగ్ స్కూల్‌లో 32 రోజులు శిక్షణ పొంది హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. శిక్షణకు హాజరయ్యేవారు ప్రభుత్వ రుసుము రూ.23,600 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

### 11న బియ్యం, బేడలకు వేలం

**కదిరి టౌన్:** ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి భక్తులు సమర్పించిన బియ్యం, బేడలను ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం కేజీ రూ.1 చొప్పున వేలం వేస్తామని, ఆసక్తి కలిగిన వారు రూ.50 వేల ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలం అనంతరం మొత్తం నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# పరమత సహనంతోనే శాంతి



సర్వమత సమ్మేళనంలో మాట్లాడుతున్న పీఠాధిపతి తాజ్‌బాబా

**సర్వమత సమ్మేళనంలో వక్తలు**

- ఘనంగా బాబయ్య దర్గా ఉరుసు ఉత్సవాలు
- సామాజిక, ఆధ్యాత్మిక వేత్తలకు పురస్కారాల ప్రదానం

**పెనుకొండ:** 'సర్వమతాల సారం ఒక్కటే.. ఈ విశ్వంలో భగవంతుడూ ఒక్కరే. కాకపోతే ఒక్కొక్కరూ ఒక్కో రూపంలో పూజిస్తుంటారు. అందరూ గొప్పవారే. అన్ని మతాలూ గొప్పవే. అందువల్ల అందరూ పరమత సహనం పాటించాలి. అప్పుడే శాంతి పరిఢవిల్లుతుంది' అని ఆధ్యాత్మిక వేత్తలు పిలుపునిచ్చారు. పెనుకొండ బాబయ్య దర్గా 750వ ఉరుసు సందర్భంగా బుధవారం రాత్రి దర్గా ఆవరణలో పీఠాధిపతి తాజ్‌బాబా నేతృత్వంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో వక్తలు ప్రసంగించారు. ప్రస్తుతం మత ఘర్షణలు పెరిగి అశాంతి నెలకొందన్నారు. ప్రజలు సహనం పాటిస్తూ... ప్రేమ, అనురాగం, అభిమానంతో జీవితం సాగించాలన్నారు. మత సామరస్యం పరిఢవిల్లినప్పుడే పురోగతి సాధ్యమన్నారు. బాబయ్య దర్గా గంధం వేడుకల సందర్భంగా మతసామరస్యాన్ని కాంక్షిస్తూ పీఠాధిపతి తాజ్‌బాబా ఏటా చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు.

**50 మందికి జాతీయ సమైక్యత పురస్కారాలు..**

దర్గా ఉత్సవాల సందర్భంగా జాతి సమైక్యత, మతసామరస్యం కోసం పాటు పడిన 50 మందికి జాతీయ సమైక్యత పురస్కారాలు అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం, ముస్లిం నగారా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దర్గా ఆవరణలో నిర్వహించిన పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అవార్డు గ్రహీతల్లో కర్నూలుకు చెందిన సాయి సంస్థాన్ పీఠాధిపతి శివసాయి గురూజీ, బెంగళూరుకు చెందిన నాగభైరవ, కర్ణాటకకు చెందిన శివ మృత్యుంజయ, బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయం సిస్టర్ డా.హేమలత, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ చిలకల మస్తాన్, సినీనటి గాయత్రి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. 36 ఏళ్ల నుంచి దేశ సమైక్యత కోసం, మత సామరస్యం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా సైతం జాతీయ సమైక్య పురస్కారం అందుకున్నారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ తీసుకువెళ్తామన్నారు.

**● ఘనంగా గంధం వేడుక**

బాబాయ్య దర్గా 750వ గంధం, ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మొదటి గంధం వేడుక ఘనంగా నిర్వహించారు. మొదటి గంధం పీఠాధిపతి సజ్జిద్‌బాబా, ఆయన కుటుంబీకులు, మతపెద్దలు వెంటరాగా గంధాన్ని తలపై ఉంచుకుని ఇంటి నుంచి బయలుదేరారు. భక్తుల కోలాహలం నడుమ బాబయ్య స్వామి సమాధి వద్దకు చేరుకుని గంధాన్ని సమర్పించారు. అనంతరం బాబయ్య స్వామి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఫకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గంధం వేడుకను తిలకించడానికి భక్తులు భారీగా తరలిరాగా పెనుకొండ జనసంద్రాన్ని తలపించింది. అనంతరం స్వామి సమాధి వద్ద ఉంచిన గంధాన్ని భక్తులకు అందజేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు.



గంధం సమర్పించేందుకు వస్తున్న పీఠాధిపతి సజ్జిద్‌బాబా (ఇన్‌సెట్) గంధం తీసుకువస్తున్న దృశ్యం

# పాఠాలు చెప్పకపోతే పంపించేస్తా



ఎన్‌పీ కుంట జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి

- ఉపాధ్యాయులపై ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఆగ్రహం

**ఎన్‌పీకుంట:** పాఠాలు చెప్పాల్సిన సమయంలో ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఖాళీగా కూర్చోవడంపై ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే పంపిచేస్తామని హెచ్చరించారు. బుధవారం ఆమె మండలంలోని ధనియానిచెరువు, ఎన్‌పీ కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగార్జున ఇంగ్లిష్ మీడియం పాఠశాలలతో పాటు ఎన్.రెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తరగతి గదులలో పాఠాలు చెప్పకుండా ఖాళీగా కూర్చోవడాన్ని గమనించిన ఇన్‌చార్జ్ డీఈఓ.. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పది ఫలితాల్లో తేడా వస్తే ఎవరినీ ఉపేక్షించబోమని, అందువల్లే ఉపాధ్యాయులంతా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్య అందించాలన్నారు. అనంతరం పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనం సామగ్రి, సైన్స్ ల్యాబ్‌లను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో మూడు స్టాఫ్ రూములు ఉండటాన్ని గమనించి.....ఇన్ని అవసరమా..? అని ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి విధులపట్ల నిర్లక్ష్యం వహించరాదని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారి అరెస్ట్

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** డ్రగ్స్ రవాణా కేసులో కీలక నిందితుడు నైజీరియాకు చెందిన ఆంటోనిని అనంతపురం పోలీసులు కర్ణాటకలో అరెస్ట్ చేశారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపించారు. వివరాలిలా ఉన్నాయి. గత డిసెంబర్ 20న అనంతపురం నగర శివారులోని ధాబా వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న కర్ణాటక రాష్ట్రం బెంగళూరు– నార్త్, ఎం.ఎస్. పలయ విద్యారణ్యపుర సమీపంలోని ముబారక్ వీధికి చెందిన సయ్యద్ అక్యూబ్ జావీద్, చిక్కబెట్ట హళ్లికి చెందిన షేక్ పర్వేజ్‌ను త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు బృందం అరెస్ట్ చేసింది. డ్రగ్స్ సరఫరా– విక్రయ ముఠా వెనుక ఎవరున్నారనే కోణంలో విచారణ చేశారు. ఈ ముఠాకు కీలక సభ్యుడు ఆంటోని శామ్యూల్ అలియాస్ ఐకే అని తేల్చారు. అయితే ఇప్పటికే పలు కేసుల్లో జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆంటోని అరెస్ట్ కష్టతరంగా మారింది. మంగళవారం బెంగళూరులో జైలు నుంచి బయటకు వచ్చిన ఆంటోనిని అనంతపురం పోలీసులు పీటీ వారంట్ కింద అరెస్ట్ చేశారు. బుధవారం అనంతపురంలోని మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఆంటోనిని రిమాండ్‌కు తరలించారు.



బెంగళూరు జైలు వద్ద ఆంటోనిని అరెస్ట్ చేస్తున్న 'అనంత' పోలీసులు

# సరిహద్దులో హెచ్చెల్సీకి తగ్గిన నీరు



ఆంధ్రా సరిహద్దు హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలువ ( హెచ్చెల్సీ)లో ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద బుధవారం నీటిమట్టం గణనీయంగా తగ్గింది. ఇప్పటి వరకూ సరిహద్దులో 25 టీఎంసీల వరకు నీరు విడుదలైనట్లు కణేకల్లు హెచ్చెల్సీ డీఈ గోపాల్‌నాయక్ తెలిపారు. హెచ్ఎల్ఎంసీ పరిధిలో పంటలకు నీటి సరఫరా నిలుపుదల చేయడంతో సరిహద్దులో హెచ్చెల్సీకి 2 వేల క్యూసెక్కుల నుంచి వెయ్యి క్యూసెక్కులకు తగ్గించినట్లు వివరించారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీటిని కణేకల్లు చెరువు మీదుగా పీఏబీఆర్, ఎంపీఆర్ జలాశయాలతో పాటు జీబీసీకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. జలాశయం నుంచి తక్కువ నీటిని తీసుకుంటే మరిన్ని రోజులు ఎక్కువగా నీరు వచ్చే అవకాశం ఉందంటున్నారు. అయితే ప్రస్తుతం విడుదలవుతున్న నీరు హెచ్ఎల్ఎంసీ పరిధిలోని తూములకు అందడం లేదని రైతులు తెలిపారు. హెచ్చెల్సీ కింద జొన్న, పత్తి, మిరప, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న వంటి పంటలు సాగులో ఉన్నాయని, కనీసం ఫిబ్రవరి ఆఖరు వరకూ పంటలకు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



# పెనుకొండ టీడీపీలో ముసలం

- వర్గాలుగా చీలిన నాయకులు
- సవిత, నిమ్మల దెబ్బకు పార్థుడికి కునుకు దూరం
- విడివిడిగా కార్యాలయాలు
- వేర్వేరుగా సమావేశాలు



పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ముసలం పుట్టింది. కురుబ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సవిత, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప వరుస కార్యక్రమాలతో మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాబోవు ఎన్నికల్లో గెలుపు మాట అటుంచితే పార్టీ టికెట్ పార్థుడికి దక్కడం కష్టమేనన్న వాదన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

**సవిత ధీమా**

రాబోవు ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువతకు ప్రాధాన్యతనిస్తున్నట్లు టీడీపీ అధిష్టానం ప్రకటించడంతో కురుబ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సవితలో ఆశలు రేకెత్తాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు విస్తృతం చేశారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ టికెట్ తన కేనంటూ ఇప్పటికే పార్టీ శ్రేణులకు స్పష్టం చేసిన ఆమె.. ఇతర జిల్లాల్లోనూ పార్టీ చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటూ తన ఇమేజ్‌ను పెంచుకునే చర్యలు ముమ్మరం చేశారు.

**కలిసొచ్చిన రాజకీయ శత్రువు..**

మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పకు మధ్య ఉన్న రాజకీయ శత్రుత్వం సవితకు కలిసొచ్చింది. పార్థుడిని ఎలాగైనా దెబ్బ తీయాలన్న కసి నిమ్మలలో వ్యక్తమవుతోంది. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న బీకే ప్రతి సమావేశంలోనూ నిమ్మలను అవమానపరుస్తూ వచ్చారు. దీంతో పార్థుడి ఓటమే లక్ష్యంగా కిష్టప్ప తన రాజకీయ అస్త్రాలను ఎక్కు పెట్టారు. ఈ క్రమంలో సవితకు కిష్టప్ప మద్దతు ఇస్తున్నట్లుగా పార్టీ శ్రేణులు బాహాటంగానే పేర్కొంటున్నాయి. దీనికి తోడు తన కుమారులు అంబరీష్, శిరీష్‌లో ఎవరో ఒకరికి పార్టీ టికెట్ దక్కించుకునేందుకు కిష్టప్ప పావులు కదుపుతున్నారు. పుట్టపర్తి లేక పెనుకొండ నియోజకవర్గాల్లో ఏదో ఒక స్థానం నుంచి కుమారులను బరిలో దించేందుకు కిష్టప్ప ప్రయత్నాలు చేస్తున్నారు. అదే సమయంలో ఎలాగైనా తన భార్యకు పార్టీ టికెట్ దక్కించుకునేందుకు సవిత భర్త వెంకటేశ్వర చౌదరి పెద్ద ఎత్తున లాబీయింగ్ మొదలు పెట్టారు. కానీ బీకే మాత్రం అధిష్టానానికి తనపైనే ఎంతో గురి ఉందని, ప్రజల్లోనూ తనకే పట్టు ఉందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ధీమాతోనే పార్టీలో ఏ ఒక్కరినీ ఆయన ఖాతరు చేయడం లేదు.

**ఎడమొహం.. పెడమొహం..**

పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీలో గ్రూపు రాజకీయాలు ఎక్కువయ్యాయి. బీకే పార్థసారథి ఓ కార్యక్రమాన్ని చేపడితే దానికి ప్రతిగా సవిత మరో కార్యక్రమానికి పిలుపునిస్తోంది. దీంతో నిన్నామొన్నటి వరకూ బీకే వెంట నడిచిన పలువురు ముఖ్య నాయకులు సవితమ్మ గ్రూపులోకి చేరారు. ఇక ఏదైనా కార్యక్రమంలో ఇరు వర్గాలు ఎదురుపడ్డా.. ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నాయి. అంతటితో ఆగకుండా దూషణల పర్వానికి తెర తీస్తున్నాయి.

ఇటీవల పెనుకొండలోని బోయగేరిలో పార్థుడి నేతృత్వంలో జరిగిన ఓ కార్యక్రమం ఇందుకు అద్దం పడుతోంది. తమ ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు ఆ కార్యక్రమంలో పాల్గొనరాదంటూ పార్థుడి ముఖ్య అనుచరుడు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాడు. ఇది వర్గ పోరుకు మరింత ఆజ్యం పోసింది.

**పోటాపోటీగా కార్యాలయాలు..**

పెనుకొండలో టీడీపీ నాయకులు రెండు కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. తన స్వగృహంలోనే పార్థుడు కార్యాలయం నిర్వహిస్తుండగా.. ప్రతిగా ఎన్టీఆర్ సర్కిల్‌లో సవితమ్మ చేత మరో కార్యాలయాన్ని ఆమె వర్గీయులు ఏర్పాటు చేయించారు. అంతటితో ఆగకుండా పోటాపోటీగా కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ కిందిస్థాయి కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తున్నారు. ఎన్నికలకు మరో ఏడాదిన్నర కాలం ఉండడంతో ముగ్గురు నాయకుల మధ్య తీవ్ర విభేదాలు చంద్రబాబు, లోకేష్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

## రెండు ఐ ఫోన్ల అపహరణ

ముదిగుబ్బ: నకిలీ అడ్రసుతో రెండు ఐఫోన్లను అపహరించుకెళ్లిన ఘటన బుధవారం ముదిగుబ్బలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బుధవారం ఉదయం ఫ్లిప్‌కార్ట్‌కు సంబంధించిన డెలివరీ బాయ్ మోహన్‌బాబు... తన పరిధిలో వచ్చిన రెండు ఐ ఫోన్ల పార్శిళ్లను డెలివరీ ఇచ్చేందుకు బయలుదేరాడు. పార్శిళ్లపై ఉన్న ఫోన్ నంబర్ కాల్ చేసి విషయాన్ని ముందుగా తెలపడంతో బుక్ చేసిన వారు సూచించిన అడ్రస్‌కు చేరుకున్నాడు. ఆ సమయంలో పార్శిల్ తీసుకున్న వ్యక్తి తమ నాన్న బయటకు వెళ్లాడని, గంట తర్వాత వస్తే డబ్బు ఇస్తామని పేర్కొనడంతో వారి మాటలు నమ్మి పార్శిల్ ఇచ్చి గంట తర్వాత వచ్చాడు. ఈ లోపు పార్శిల్‌ను మార్చేసిన ఆగంతకుడు తమకు ఫోన్లు వద్దంటూ వెనక్కు ఇచ్చేసి, వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత డెలివరీ బాయ్‌కు అనుమానం వచ్చి బాక్స్‌లను చూసి చూడగా అందులో ఫోన్లకు బదులు సబ్బులు కనిపించాయి. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫోన్ల విలువ రూ.82 వేలుగా పేర్కొన్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ‘బాబయ్య స్వామి’ని దర్శించుకున్న కలెక్టర్



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: దక్షిణ భారత దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన బాబయ్య స్వామి దర్గాను కలెక్టర్ బసంత్‌కుమార్, సబ్ కలెక్టర్ కార్తీక్ బుధవారం సందర్శించారు. ఫక్కీర్ల విన్యాసాలతో వారిని పీఠాధిపతి తాజ్‌బాబా, సలావుద్దీన్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సందల్ మహల్ నుంచి చాదర్‌ను ఊరేగింపుగా తీసుకెళ్లి బాబయ్య స్వామి సమాధికి సమర్పించి, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా మర్యాదలతో వారిని పీఠాధిపతి సత్కరించి, ప్రసాదాలను అందజేశారు. తహసీల్దార్ స్వర్ణలత, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ రఫీ, అధికారులు ఇమ్రాన్, మస్తాన్‌బాబా, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్‌పై ఎలుగుబంటి దాడి



చికిత్స పొందుతున్న హనుమంతరాయుడు

శెట్టూరు: యాటకల్లుకు చెందిన వలంటీర్ హనుమంతరాయుడుపై ఎలుగుబంటి దాడిచేసి గాయపరిచింది. బుధవారం తెల్లవారుజామున వలంటీర్ వాకింగ్ కోసం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. పెట్రోల్ బంకు దాటి ప్రధాన రోడ్డు వద్దకు రాగానే పొదలచాటు నుంచి ఎలుగుబంటి దాడి చేసింది. ఈ హఠాత్పరిణామంతో వలంటీర్ గట్టిగా కేకలు వేయడంతో సమీప ఇళ్లలోని జనం పరుగున సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారి రాకను చూసిన ఎలుగుబంటి అక్కడి నుంచి పారిపోయింది. గాయపడ్డ హనుమంతరాయుడిని వెంటనే కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. రెండు నెలల కిందట గ్రామం పక్కనే ఓ చిరుత రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. వన్యమృగాలు తరచూ గ్రామ సమీపంలోకి వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి అడవిజంతువుల నుంచి తమను రక్షించాలని యాటకల్లు గ్రామస్తులు కోరుతున్నారు.

## డీఐజీని కలసిన ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్‌ని బుధవారం శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు ఆ జిల్లా అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, డీఎస్పీలు హుస్సేన్ పీరా, ఉమామహేశ్వర రెడ్డి, పలువురు సీఐలు ఉన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టండి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఆవుటాల రమణారెడ్డి

ఓడీ చెరువు: బోరుబావుల కింద రబీలో సాగు చేసిన వేరుశనగ పంటలో అధిక దిగుబడి సాధించాలంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి సూచించారు. ఓడీ చెరువు మండలంలో సాగు చేసిన వేరుశనగ పంటలను వ్యవసాయాధికారి ఇలియాజ్ అహమ్మద్, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ లక్ష్మీరెడ్డితో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆర్బీకేలో గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## మెగా జాబ్‌మేళా వాయిదా

కళ్యాణదుర్గం: ఎస్ఈఈడీపీ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ), నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో త్వరలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని జాబ్స్ కో ఆర్డినేటర్ ఎం.ఓబిలేసు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. గతంలో ప్రకటించినట్లుగా ఆరో తేదీ జాబ్‌మేళాను వాయిదా వేసినట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ మార్పును గమనించాలని సూచించారు. పూర్తి వివరాలకు 82478 85109, 08554-280936లో సంప్రదించాలన్నారు.



# శింగనమల టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- వెంకటాపురంలో ద్విసభ్య కమిటీ సభ్యులను అడ్డుకున్న బండారు శ్రావణి వర్గీయులు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేకుండా ఎలా వస్తారంటూ నిలదీత
- ఎస్సీలను చులకనగా చూస్తున్నారని మండిపాటు

శింగనమల: శింగనమల నియోజకవర్గ టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురంలో బుధవారం టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి తో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామలింగారెడ్డిలను అదే పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి వర్గీయులు అడ్డుకున్నారు. బుధవారం వెంకటాపురంలో టీడీపీ ఆధ్వర్యంలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండారు శ్రావణిని ఆహ్వానించలేదు. ద్విసభ్య కమిటీ సభ్యులు, వారి వర్గీయులు మాత్రమే హాజరయ్యారు. దీంతో శ్రావణి వర్గీయులు ఆగ్రహానికి గురయ్యారు. ఇన్‌చార్జ్‌ను విస్మరించి మీరెలా వస్తారని, గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి అడుగుపెట్టనివ్వబోమంటూ అడ్డుకున్నారు. ఎస్సీ నియోజకవర్గమైనప్పటికీ ఆ వర్గానికే ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఓసీ సామాజిక వర్గం వారిని ద్విసభ్య కమిటీ సభ్యులుగా నియమించి.. ఎస్సీలకు విలువ లేకుండా చేశారన్నారు. అయితే.. ద్విసభ్య కమిటీ సభ్యుల మద్దతుదారులు ఈలలు వేసుకుంటూ, శ్రావణి వర్గీయులను తోసుకుంటూ కాలనీలోకి వెళ్లడానికి ప్రయత్నించారు. ప్రత్యర్థులు ప్రతిఘటించడంతో చివరకు ఎస్సీ కాలనీలో కార్యక్రమం నిర్వహించకుండానే వెనుదిరిగారు.

**తారస్థాయికి విభేదాలు**

గత అసెంబ్లీ ఎన్నికల్లో శింగనమల నుంచి టీడీపీ తరఫున బండారు శ్రావణి పోటీ చేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతి చేతిలో ఓడిపోయారు. తర్వాత శ్రావణిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించారు. కానీ అదే పార్టీకి చెందిన ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు నియోజకవర్గంలో పాగా వేయడానికి ప్రయత్నించారు. దీంతో 'తమ్ముళ్లు' రెండు వర్గాలుగా విడిపోయారు. శ్రావణిపై అసంతృప్తితో నియోజకవర్గ నాయకులు పార్టీ అధిష్టానానికి పదేపదే ఫిర్యాదులు చేశారు. అధిష్టానం ఆమెకు చెక్ పెడుతూ ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిలతో ద్విసభ్య కమిటీని నియమించింది. ప్రస్తుతం ద్విసభ్య కమిటీ సభ్యులు ఒకవైపు, శ్రావణి మరోవైపు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రతి గ్రామంలోనూ టీడీపీలో రెండు గ్రూపులు ఏర్పడ్డాయి.

## అనాథలా.. ఆస్పత్రిలోనే..



మృతుడు రెడ్డి మోహన్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని అనాథగా ఆస్పత్రిలో చేర్పించి వదిలేశారు. అయిన వారు లేక ఆస్పత్రిలోనే ఆయన మృతి చెందాడు. అనంతపురం సర్వజనా స్పత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడిని అన్నమయ్య జిల్లా మొలకలచెరువు గ్రామానికి చెందిన కృష్ణమాచారి కుమారుడు రెడ్డి మోహన్(60)గా అనంతపురం రెండో పట్టణ పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతన్ని గత ఏడాది డిసెంబర్ 30న సర్వజనాస్పత్రిలో చేర్పించి వెళ్లారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతిచెందాడు. అడ్మిషన్ కార్డులో రాయించిన చిరునామా మేరకు మృతుడిని రెడ్డి మోహన్‌గా గుర్తించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

## యువకుడి బలవన్మరణం

గాండ్లపెంట: అనారోగ్య పరిస్థితిని తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గాండ్లపెంట మండలం సానుచేనుబైలుకు చెందిన కొండమేని గంగయ్య ఐదేళ్ల క్రితమే కుటుంబసభ్యులతో కలసి బెంగళూరుకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈ క్రమంలో గ్రామంలోని బంధువుల ఇంట్లో మంగళవారం జరిగిన అయ్యప్పస్వామి ఇరుముడి కార్యక్రమానికి గంగయ్య కుమారుడు శ్యామ్‌ప్రసాద్ (22) హాజరయ్యాడు. కార్యక్రమం ముగిసిన తర్వాత అదే రోజు రాత్రి గ్రామంలోని సొంతింట్లో నిద్ర పోయాడు. బుధవారం ఉదయం ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో 9 గంటల సమయంలో బంధువు రామాంజులు వెళ్లి తలుపు తీసి చూశాడు. లోపల చీరతో వేసుకున్న ఉరికి వేలాడుతున్న శ్యామ్‌ప్రసాద్ మృతదేహాన్ని చూసి, విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు చేరవేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అయితే తన కుమారుడు మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడని, వ్యాధి నయం కాకపోవడంతో తరచూ బాధపడేవాడని, ఈ విషయంగానే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

కొత్తచెరువు: మండలంలోని మామిళ్లకుంట క్రాస్‌కు చెందిన గంగాద్రి కుమారుడు నరేష్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న నరేష్.. ప్రేమ విఫలం కావడంతో బుధవారం రాత్రి 8 గంటలకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.